# పుణ్యకార్యము

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుండగు సర్వేశ్వరుని యద్భుతసృష్టి యందనేక వైచిత్ర్యములనేక వైపరీత్యములు కూడ కన్పట్టుచుండుటవలన నాకు మిక్కిలి మనస్తాపముగానున్నది. ప్రళయకాల మాసన్నమగుటయు, సృష్టికి అంత్యదశ సమీపించుటయు జరుగుచున్నవనుటకిట్టి విపరీత చిహ్నములు పొడగట్టుటకంటె ప్రబల నిదర్శనమేది కావలెను ?

జరిగిన విపరీతమెద్దియనగా శుక్రగ్రహము పైకి మానవ నిర్మితమైన యంత్రశకటమొకటి పోయి దిగి - కొద్దికాలము ఆ గ్రహోపరితలమున తిరిగి, వచ్చుచు కొన్ని ఛాయాచిత్రములను దీసికొనివచ్చినదట. కొంత ధూళినిగూడా దీసికొని వచ్చినదట. ఈ వార్తను భూమండలమందలి యన్ని పత్రికలు, ఆకాశ వాణియు ఘోషించుచున్నవి. వామపక్షదేశమయిన రష్యా ఈ విజయవంతమైన మహత్కార్యములను సాధించుటవలన కొందరు మరింతగా సంతోషించుచున్నారు.

నాకు శుక్రగ్రహమన్న విశేష ప్రీతి, నా జాతకమందు శుక్రుడు మిత్ర స్థానమున నుండుట ఇందుకొక కారణము.

భగవంతుని సృష్టియందలి దివ్యస్వరూపములేమి ? అవి స్వర్లోకమగు ఆకాశ భూములకుండుటయే ? మర్త్యులును, బుద్బుద ప్రాయులైన మానవులునిర్మించిన యంత్రములటకు పోయి ఛాయా చిత్రములనుదీసి,మట్టిని గొనివచ్చుట యేమి ! భగవంతుని చిద్విలాసము వలననే ఆ దివ్యస్వరూపములు ధూళితో నిండిన గ్రహములవలె మారియుండెననుటకు సందేహమేమి ?

నేటికి సుమారు పదునైదేండ్ల క్రితము (1969లో) రాకా సుధాకరుండగు చంద్రుని కడకేగి మేచ్ఛులైన మానవులు శిలలు గొనివచ్చిరట. (ఎందుకు ? నెత్తి బగులగొట్టు కొనుటకు?) కలశపాధోరాశియందు, అమృత సహోదరుడై జన్మించిన యా దివ్యపురుషుని మానవులు చేరుటయా ? కల్ల ! మానవులేదో ఒక గ్రహతలముపై దిగి కొన్ని రాళ్ళేరుకొని వచ్చిరని నా తలంపు నాయభిప్రాయముతో నా చిరకాల మిత్రుడును, భూగోళ శాస్త్రాచార్యుడును, స్వామీ మాయానందులవారు స్థాపించిన విశ్వ విద్యాలయమున గౌరవకులపతియునైన ఆచార్య నరసింహమూర్తిగారేకీభవించిరి. వారు విశేషముగ హూణ విద్యనేర్చినను, మన మత సాంప్రదాయములయందు పరిపూర్ణ విశ్వాసములు కలవారు. మతాచారములయందిమిడియున్న శాస్త్రీయాంశములను ప్రచారము చేయుచున్న దిట్ట. వారికి విదేశములలో సైతమనేకమంది మిత్రులు గలరు. స్వామీ మాయానందులవారి కేశములయందు (రష్యన్ రసాయన శాస్త్రవేత్తయగు దిమిత్రి మెండలియేవ్ కనుగొనిన) నూరు మూలకములును ఇమిడి యున్నవని ఉద్ఘాటించి ప్రయోగపూర్వకముగా సిద్ధాంతీకరించిన ఘనచరిత్రము గలవారు.

చంద్రునిపైకి మానవులు పోవుటను అమెరికాలోను, యూరపులోను అనేకమంది అభ్యుదయ భావాలుగల మతాచార్యులును, భక్తి తత్పరులైన యువకులును (ప్రపంచ కృష్ణ సమాజమునకు చెందిన

ఈ యువకులను మూర్ఖులు కొందరు హిప్పీలని గేలిచేయుదురు.) వ్యతిరేకించిరని విన్నప్పుడు నాయానందమున కవధిలేదు. మేధావులన్న నావిధముగా నుండవలెను. (అమెరికాలో మూర్ఖుల సంఖ్య పెరుగుచున్నదని ఇటీవల మా విజయనగరంలో "అవగాహన" సంఘమువారు ప్రచారము చేయుచున్నారట. సామ్రాజ్యవాద మవసానదశలో కొట్టుమిట్టులాడుచు ఇట్టి వెర్రి మొర్రి వేషములు వేయుచున్నదని వారనిరట. ఏమి ఈ తిలకాష్ట మహిష బంధనము!) మన దేశములోను కొందరు బుద్ధిమంతులు దీనిని వ్యతిరేకించి, విశ్వాంతరాళమందలి గ్రహములన పవిత్రముచేయు శాస్త్రపరిశోధనలు గావించిరట, ఉత్తరభారతమున ఒక మాజీ సంస్థానాధీశ్వరురాలగు రాణీ పుణ్యవతీదేవి అను పుణ్యాత్మురాలు పాపులగు మానవులు తాకుటచే యపవిత్రమైన చంద్రమండలమును తిరిగి పవిత్రమొనర్చుటకై కాశీనగరమందు పక్షము దినముల గ్రహశాంతులును, పుణ్యాహ వాచనములును శుద్ధికార్యక్రమములను చేయించినదట. మరియొక కోటీశ్వరుడైన పారిశ్రామికవేత్త యజ్ఞమును చేయించెనట. ఇట్టి పుణ్యాత్ములుండుట వలననే కదా ప్రపంచ మీమాత్రమైనను నిలిచినది !

ఆ సమయమున నేనును యధాశక్తి యీశ్వరాలయమున గ్రహశాంతి చేయించితిని "సారపు ధర్మమున్ విమలసత్యము పాపముచేత బొంకుచే పారము పొందలేక చెడబారిన దైనయవస్థనున్నగని దక్షులెవ్వారలు పేక్షసేతు రది వారల చేటగుగాని ..... ధర్మరక్షణకు దైవముండెనని" మహాజ్ఞానియగు మహాకవి తిక్కన సోమయాజి నుడువలేదా ? ఆ దైవమునాయందు ప్రవేశించి యిట్టి పుణ్యకార్యములను చేయించుచున్నాడని నేను దృఢముగా విశ్వసించుచున్నాను.

చంద్రమండలముపై మానవుడు పాదము మోపినదాదిగా నేటివరకుగల మనదేశచరిత్రను పరిశీలింపుడు. ఎన్నియనర్ధములు జరిగినవెన్ని యుద్ధములు జరిగినవో మీకు బోధపడును. చిలీలో యుద్ధము, వియత్నాంలో యుద్ధము సరేసరి - బంగ్లాదేశ్‌లో దేశాధినేత యగు ముజిబూర్ రెహమాన్ హత్య, పాకిస్థాన్‌లో భుట్టో మహాశయునికురిశిక్ష (హర హరా - అవక్ర విక్రమ పరాక్రమముతో దేశమునేలిన మానవేంద్రుని కురిశిక్షయా ?) మనదేశమున విదేశీ కల్లోలముల వలనను, అంతరంగిక సంక్షోభమువలనను యాత్యయిక పరిస్థితి విధింపు, ఈ జిప్టులో దేశాధ్యక్షుడైన సాదత్ హత్య...... ఇవన్నియుగాక భూకంపములు, వరదలు మొదలగు ఉత్పాతములు..... ఇట్ల సంఖ్యాకముగా జరిగిన ఘోరములెన్నడైన పరిశీలించితిరా ? ఇంత జరుగుచున్నను భగవంతుని లీలలను గ్రహింపనేరక, అంతరిక్షములోనికి "స్కైలాబ్" ను ప్రయోగించిరీ నీచమానవులు. కనీసమది విఫలమైనప్పుడైనను అది భగవంతుని యిచ్ఛకు వ్యతిరేకమని ఏల గ్రహింపరో నాకు బోధపడదు.

క్రైస్తవ మతస్థుడయ్యు 'దానియేలు' అను నొక బుద్ధిమంతుడైన పాధరీయొకాయన అఖిలాంధ్ర సహోదర మహాసభాధ్యక్ష స్థానము నుండి నేను పలికిన విధముగనే పలికి- "పరలోకమందున్న పరమ పితయగు ఆ ప్రభువు ఆజ్ఞను మీరకుడి. శాస్త్రజ్ఞానము పేర ప్రకృతి సూత్రమును ధిక్కరింపకుడి. ప్రభువు సృష్టిని కలుషితము చేయకుడి" - అని ఉద్ఘోషించెను.

నాకంతగా పరిచయములేదుగాని మహమ్మదీయ మతస్థదెవరైనను తప్పక ఇట్లే

అభిప్రాయపడెదరు. డార్విన్ అనునొక మూర్ఖపండితుడు- సృష్టి పరిణామక్రమమును మత గ్రంధములందున్న దాని కంటె భిన్నముగా సిద్ధాంతీకరికచెనట. ఇటీవల (1984సంవత్సరము మధ్యభాగమున) బుద్ధిమంతులగు కొందరు ముస్లిములు డార్విన్ గ్రంధముపై కాశ్మీర రాష్ట్ర మందలి ఉన్నత న్యాయస్థానమందు అభియోగము దెచ్చిదానిని విద్యాలయములందు బోధింపకుండ నిషేధించిరని వినియుంటిని.

పాఠక మహాశయులారా చూచితిరా! భగవంతుని స్థాపించుటయందు సర్వమతములును సమానములే..

ఇప్పుడసలు కధకువత్తును. మానవనిర్మిత యుపగ్రహము శుక్రగ్రహముపై దిగుటవలన నా గ్రహము అపవిత్రమైనదనుట నిర్వివాదము. దానికి తగిన శాంతి చేయు నాలోచనము చేయవలెను. అఖిల భారత భజన సంఘము వారితో సంప్రదించవలెనని యోచించుచుంటెని కాని అంత వ్యవధిలేదు. వీలయినంత త్వరితముగా గ్రహశాంతి చేసిన గాని నాకు మనశ్శాంతియుండదు. వారిప్పుడు బి.జె.పి. అనగా భజన జన పరివారము అనుపేర నొక అనుబంధ సంఘము (రాజకీయ పార్టీ ?) స్థాపించిరట.

మావిజయనగరము పూర్వమువలెగాదు. నాస్తికులును, వామపక్షీయులును, ప్రగతిశీల భావములు గలవారును ఇనుమిక్కిలిగా తయారగుచున్నారు. పురాణములను, పంచాంగము లను వ్యతిరేకించు ప్రగతిశీల సంఘమువారన్న నాకొడలుమంట. ఆ సంఘమునకు " మా.స." యనునతడి కీలక ప్రాయుడు. రెడ్డి పంతులు, మూలేశ్వరరావను వారలు యతనని ప్రోద్బలము చేయుచుందురు. ఆరుణ కిరణ్, ఎం.వీ.వీ., అప్పలరాజు, అనంతం అని మరికొంతమూక గూడ నా సంఘమున జేరినది. వారి సంఘవేదిక యగు "అవగాహన" ఆధ్వర్యమున పెద్ద సభచేసి మానముడు వైజ్ఞానికముగా నెంతయో పురోగతిచెందుచున్నాడనియు అనతి కాలములోనే సృష్టి రహస్యములను విశ్వరహస్యములను ఛేదింపగలడనియు, మత మూర్ఖత్వమునశించు ననియు, సమసమాజ మేర్పడుననియు నేమేమోకూసిరట. వారికి వామపక్షములవారు వత్తాసు పలికిరట. సరియయిన సోషలిస్టు వ్యవస్థకొరకు వారు సమైక్యముగా పోరాడుదురట. ఏమి ఘోరకలి? వీరబ్రహ్మంగారు చెప్పిన వైపరీత్యములన్నియు వరుసగా జరుగుచున్నవి.

ఆ సభనుగూర్చి విన్న తరువాత ఇంటికి వచ్చి సచేల స్నానమాచరింతమనుకొంటిని గాని, స్నానమునకు బదులు ఉద్ధరిణితో మంత్రవజలమును శరీరము పై చిలకరించుకొను సూక్ష్మపద్ధతిని మహా మేధా సంపన్నులైన సనాతనాచార శిఖామణులు కనిపెట్టియుండిరి గనుక నేనా విధముగా జేసి పరిశుద్ధడనైతిని.. (కరెంటు కోతవలన కొళాయిల్లో నీరురాక నీటికి కొరతయగుటయు కొంత వరకు కారణము.)

మరునాటి ప్రాతఃకాలమునలేచి - స్నానాదికములాచరించి - శుక్రగ్రహశాంతి విధానము కొరకు సిద్ధాంతిగారి యింటికి బోగా ఆయన ఎవ్వరినో ఉద్ధరించుటకు దూర గ్రామమునకు పోయిరని, ఒక పక్షము తరువాతగాని రారని తెలిసినది, అతని కుమారుడగు చిన్న సిద్ధాంతి బుద్ధిమంతుడే. మంత్రతంత్రములందారితేరిన వాడే, ఉన్నత పాఠశాలలో ఏడవతరగతి ఎనిమిదిసార్లు తప్పిన

కారణముచేత తండ్రివానిచే నిక హూణ విద్యను మాన్పించి, మంత్రములు, ముహూర్తగణన, జ్యోతిషము ఇత్యాది ప్రాచీన ఆర్షవిద్యలయందు గట్టి శిక్షణ నిచ్చుచుండెను. కుమారుడును ముసలాగ్రబుద్ధియగుటచే (ముసలాగ్రము కుశాగ్రము కంటె బలమైనదికదా) విద్యలనుచితరీతి వినియోగించు విధానమును సైతము చక్కగా నేర్చుకొనెను. ఇరవదియారు సంవత్సరములవాడై యౌవనముననున్న ఈతడింత చిన్న వయసుననే "తండ్రిని మించిన తనయుడ"ని పేరుగాంచెను. ఈతడు సురాపానాదికములు, మాంసభక్షణము, వేశ్యావాటికా సందర్శనమును చేయుచున్నాడని కొందరు విమర్శించుట వింటిని, సురాపానము దోషముకాదని వేద ప్రామాణ్యముకలదు. గనుక నది దోషముకాబోదు, మాంసభక్షణ ఈశ్వరుడు చేయలేదా? ఋషులందరు చేయలేదా ? వేశ్యావాటికా సందర్శనమందురా ? మీకుకొన్ని సందటులు తెలియవు. తంత్రవిద్యయందును, స్త్రీచక్రోపాసమునకును అదియు (స్త్రీ సాంగత్యము) కొంత అవసరమట. కనుకనే అతడట్లు చేయుచుండి యుండవచ్చును. అంతియకాక "ప్రమాదో ధీమతాపపి" అన ఆర్యోక్తిచే - దోషలేశములను పరిగణించరాదు.

కనుక కుమారసిద్ధాంతిని పిలిచి విషయమంతయు వివరించిచెప్పి, తక్షణము శుక్రగ్రహశాంతి జరుగు మార్గమాలోచింపుమంటిని. భారీ ధనవ్యయముతో కూడినది కాకుండునట్లు చూడవలసినదని గూడ జెప్పితిని. అతడు యువకుడును, మిక్కిలి చురుకైనవాడును సమయాసమయ విచక్షణము తండ్రికంటె బాగుగా నెరింగినవాడును, ప్రాప్తకాలజ్ఞుడును నగటచే-త్వరితగతిని గ్రంధవీక్షణముజేసి రక్తతర్పణ మొక్కటియే మార్గమైయున్నది. భయపడకుడు. ఒక ప్రదేశమును శుభ్రముచేసి ముగ్గుతో శుక్రగ్రహ యంత్రమువేసి, గ్రహప్రతిష్టనుజేసి-బాగుగా బలిసిన మూడు కోడి పుంజులనుకోసి ఆ రక్తము తర్పణము జేసినచో కొంతకార్యసాధనము జరుగునని చెప్పెను. ఒక్కొక్క గ్రహమునకు పదిరూపాయలు తాంబూలముతోనుంచి ప్రతిష్ఠంచవలెనని - పైన తనకొక పాతిక రూపాయలను సువర్ణమంత్రపుష్పముగానిచ్చిన చాలుననియు చెప్పెను. నిస్వార్థపరుడుగనుక బహుస్వల్పముగా నడిగెను. కాని నేను మరికొంత సొమ్మధికముగ ముట్టచెప్పెదనని యాశపెట్టితిని.

రక్తతర్పణము జరుగువలెనని కుమార సిద్ధాంతి చెప్పుటతోడనే - మహాబుద్ధిమంతుడనగుటం జేసి నేనొక్క విషయమును గ్రహింపగల్గితిని. శుక్రగ్రహముపై మానవ నిర్మిత యంత్రశకటము మరి రెండు దినములలో దిగబోవుచున్నదనగా- మన భారతదేశమున అంగరక్షకుల చేతిలో భారత ప్రధాని ఇందిర హత్యగావించబడినది. ఇది రక్తతర్పణముగాక వేరేమి? చూచితిరా జనులారా - ఇట్టి విపత్కర వైజ్ఞానిక ప్రయోగములను మాని యుండినయెడల ఆమె హత్యజరుగుట కవకాశముండి యుండకపోవునని నేను ఘంటాపధముగా చెప్పగలను.

అసలుసంగతి చెప్పవలెనని, నేను మిక్కిలి జాలిగుండె గలవాడను. కూరగాయలను తరుగుట కూడచూచి నేర్చు కొనజాలను. భగవంతుని సృష్టియందు కోడియైనను కూరగాయలైనను అన్నియు ప్రాణులేకదా ! నేను స్వయంపాకము చేసికొనునప్పుడెల్ల అన్నము, పప్పుచారు, అప్పడము, కందిగుండ మొదలైనవి తయారుచేసెదనుగాని కాయగూరలను క్రూరముగాగోసి కూరయొండజాలను. అయినను

ప్రస్తుతము దైవకార్యము తప్పదు గనుక అంగీకరించి, "ప్రభుత్వ అరణ్య" శాఖయందు కొన్నాళ్ళు "ప్రభుత్వ సారా దుకాణము" నందు కొన్నాళ్ళును పనిచేసి ఉద్యోగమూడగొట్టుకొనిన "అప్పలకొండ" యను బుద్ధిమంతునిచే మూడు పందెపుకోళ్ళను గొనిపించి, మరలనడుగు వరకును - వానిని తనయింటి యందు పెంచునట్టు ఏర్పాట్లు జేసితిని. నా సలహామేరకు చక్కని శీలమును, సత్ప్రవర్తనమున గలిగిన కోళ్ళ నాతడు - విజయనగర సమీపమునగల కోకిలమెట్ట లక్ష్మీపురమునందు శుద్ధశాఖాహారముతో పెంచుచున్నాడు.

ప్రాణములు తీయునప్పుడు మంచి ముహూర్తమున తీయుటమంచిది. కోడికైనను, మనుజునకైనను స్వర్గమునకు బోవుటకు సమానహక్కుండవలెనని నా యభీష్టము (నాకును కొన్ని అభ్యదయభావములున్నవని గ్రహింప ప్రార్ధన) కనుక ఒకనాటి రాత్రి శుభమూహూర్తమున జూచి మా విజయనగరంలో దాసన్న పేట చివరగల ఒక ఖాళీ స్థలములో వేపచెట్టుక్రింద పరిశుభ్రము చేయించి, ఈ పుణ్యకార్యమునకేర్పాటు గావించితిని. కొందరు భజన సంఘ సభ్యులు నాకు సాహాయ్యము చేయుట కంగీకరించిరి.

శుభమూహూర్తమునకు ముందురోజే జబ్బు తటిలినకోడి స్వర్గ ప్రాప్తినొందెను. పంచాంగమ్న చూడగా దుర్ముహూర్తమున ప్రాణము పోయినట్లు తేలినది. పుణ్యకార్యము కొరకు కొనిరాబ ఇన ప్రాణి యావిధముగ మరణించుటకు మిక్కిలి ఖేదపడి దానియాత్మశాంతికి ప్రార్థనలుచేసి, పాపహరణమునకై మంత్రోచ్చాటనముచేసి యధాశక్తి, ఆ కోడికిగల కీడును తొలగింప యత్నించి - అధిక ధనమిచ్చి మరలనింకొక పందెపు పుంజును దెప్పించితిని. చనిపోయిన పుంజునకు నా మంత్రోచ్చాటనా ఫలము వలన తప్పక స్వర్గము ప్రాప్తించి యుండవచ్చునని నా ప్రగాఢ విశ్వాసము.

అఘటన ఘటనా సమర్థుడును, సమస్త మాయమేయజగంబున కధినాథుండును నగుపరమేశ్వరుని నిర్హేతుక జాయమాన కరుణాకటాక్షము వలన-నిర్ణీత ముహూర్తమునకు పుణ్యకార్యము జయప్రదముగా ముగిసినది. నా మనము మిక్కిలి సంతసించినది. కడుశాంతించినది. మరణించిన కుక్కుట ప్రాణముల కింకొకసారి శాంతి జేసితిని. కనుక లోగడచేసిన మంత్రోచ్చాటనము వలన గాకున్నను - ఈ సారియైన పాపము హరించుటకావగింజంతయు సందేహము లేదు. (ఆస్తిక భావ సంపన్నులగు మీకును ఉండి యుండదని నా నమ్మిక)

క్షమింపవలెను. మరొక్క ముఖ్య విషయమును మరచితిని, కొలది దినములలో నేనీ పుణ్యకార్యమును చేయుదుననగా -మధ్యప్రదేశ్ నందలి భోపాల్ నగరమునొక కర్మాగారమున విషవాయువు - కుహనామార్గము గుండ బయల్వెడుటచే - సుమారు రెండువేలమంది వరకును మృతిచెందిరని విని మిక్కిలి కలతజెందితిని. నే తలపెట్టిన పుణ్యకార్యము మరింత ముందుగ నేను పూర్తిచేయ గలిగిన యెడల ఇట్టి వైపరీత్యము జరిగియొండెడిదికాదు. ఏమందురు ? అమాయకులు శిక్ష పొందవలెనని దైవ నిర్ణయము కాబోలు. జగన్నాటక సూత్రధారి మాయలు మన మెరుంగగలమా ?

'అవగాహన' సంఘమువారు మహాకానివారు. నేజేసిన మహత్కార్యమును వారెట్లు కనిపెట్టిరోగాని - మరునాడు తెల్లవారునప్పటికి నా చర్యను ఖండించుచు నగరములోని గోడలన్నిటిమీద వ్రాతము వ్రాసి గంగరగోళము సృష్టించిరి. అంతియెకాదు. దైవకార్యము నిమిత్తము ప్రాణత్యాగముచేసిన కుక్కుటత్రయమును కొనిపోయి కుమార సిద్ధాంతి మిత్రులతోగలిసి మిదారగించెననియు, నా వద్ద సంపాదించిన ధనముతో "ఫుల్‌బాటిల్ బ్రాందీ" తెచ్చుకొని "మందుపార్టీ" గావించుకొనెననియు కూడ వింటిని. కాని నేను నమ్మను. "అవగాహన" ఇట్టి వార్తలు పుట్టించి యుందురు.

వైజ్ఞానిక ప్రయోగములను వ్యతిరేకించుట మత మౌఢ్యమట ! నేను చేసిన పని రాతియుగపు మనుష్యులు చేయుదురట ! వారి నాలుక తెగిపోను ! చేతులు విరుగ ! అంతరిక్ష యుగమునందు - 1985 ప్రారంభమగుచున్న సమయమునగూడ ఇట్టి మూఢచారములు జరుగుచున్నవని, నా యెదుటనే (నేనెవ్వరో నా ధాటియేమో యెరుగక) కొందరు తిట్టిపోసిరి. కాని మహా బుద్ధిమంతులగు ఓ మహాజనులారా నిజము గ్రహింపుడు. నావలె నిట్టి పుణ్యకార్యములాచరించువారుండ బట్టియే ఈ ప్రపంచ మీ తీరుననున్నదని తెలిసికొనుడు. నా వంటి వారెప్పటికిని యుండి తీరెదరనియు గ్రహింపుడు.

కొందరు క్రైస్తవ సోదరులును నాకు ప్రోద్బలకముగా ప్రభువును ప్రార్థించిరి.

**హెచ్చరిక :**

ఇది చదివినవారు నే జేసిన ఈ పుణ్యకార్య వృత్తాంతమును సంక్షిప్తముగా అచ్చువేయించి అయిదువేల ప్రతులను మిత్రులకు పంచవలెను. అట్లెవ్వడు పంచడో వాడు పదిదినములలో మిక్కిలి కష్టములనుభవించును. ఇరువది దినములలో వానికుటుంబ సభ్యులలో నొకరు హఠాత్మరణము పొందుదురు. ముప్పది దినములు దాటి నిర్లక్ష్యము చేసినచో ఆ వ్యక్తియే మరణించవచ్చును. ధర్మరక్షణాసక్తి కలవారై ఎవ్వడేవిధమైన సత్యప్రచారము గావించునో వానికి సకల శుభములు చేకూరును.

**గమనిక :**

పదిదినములు దాటినతరువాత పశ్చాత్తాపముతో కార్యరంగములోనికి దిగువారు ఒకొక్కక్క వెయ్యి కరపత్రములధికముగా అచ్చొత్తించి పంచవలెను. అట్లుచేసిన కొంత దోషవిముక్తి గలుగవచ్చును.

**ముఖ్యవిజ్ఞప్తి :**

నాస్తిక సంఘములు, "అవగాహన" వంటి ప్రగతిశీల సంఘములు వామపక్షసంఘములు చెప్పెడిమాటలు చెవిన బెట్టి చెడిపోవలదు.

**తుది హెచ్చరిక :**

గిడుగు, గురజాడల వంటివారు మహా పట్టుదలగాచేసిన ప్రయత్నమువలన మన ప్రాచీన గ్రాంధికభాషయడుగంటినది. నా వంటి లోకోపకార పరాయణులగు విశ్వవిద్యాలయ పండితులు దానిని రక్షించుటకు శతవిధముల ప్రయత్నించుచుండిరిగాని కార్యము జరుగుచున్నట్టు కానరాదు. కనుక అట్టి ప్రాచీనభాష నుద్ధరించుటకు నేను పూనుకొంటిని. (ఇప్పటికే అనేక ఆధ్యాత్మిక నవలలను, మరికొన్ని బాబా విరచిత సరికొత్త సనాతన ఆంగ్ల గ్రంథములను గ్రాంధికాంధ్రభాషలోనికి పరివర్తించితిని )

కరపత్రములను వేయించువారు తప్పక ఇట్టిభాషయందే వ్రాయవలెనుగాని వాడుకభాషలో వ్రాసినచో ఫలితము దక్కదనియు, మొదటి హెచ్చరికలో చేసిన ఘోరములు తప్పవనియు తుదిహెచ్చరిక జేయుచున్నాను.

ఇతి సర్వం మంగళం శుభం భూయాత్

(శుక్రగ్రహంపై మానవనిర్మిత ఉపగ్రహం దిగినట్టు ఊహించి, దానికి సనాతన ఛాందసవాదులు ఏ విధంగా వ్యతిరేక ప్రచారం చేస్తారో - ఈ కథలో వ్యంగ్యంగా చిత్రించాను. ఉత్తరాభారతంలో చంద్రగ్రహ శుద్ధియజ్ఞాన్ని ఒక మాజీ మహారాణి నిర్వహించిన వార్తను పాఠకులు మరిచిపోయిఉండరు. ఇటువంటి తిరోగాములు నేటికీవున్నారు. వీరిని ఎదుర్కొనవలసిన అగత్యం, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొనవలసిన అవసరం ప్రతి ఒక్కరిపైనా వున్నది.)

***రచన : 3 / 4 - 12 - 1984***
***ప్రచురణ : ఉపాధ్యాయ, ఫిబ్రవరి 1985***